# దేవుడా! రక్షించు నా దేశాన్ని

-కాంద్రేగుల శ్రీనివాసరావు

**ఈ** వ్యవస్థ మనల్ని మోయదు.

కానీ మన బ్రతుకులు మాత్రం ఈ వ్యవస్థని మోయక తప్పటం లేదు.




నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్న నిజం అది. ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం వెలగబెడుతోన్న నేను రెండ్రోజుల క్రితం సస్పెండ్ చేయబడ్డాను.

ఈ కమర్షియల్ సివిలైజేషన్‌లో ఆశయాలూ, ఆలోచన్లూ అతిశయోక్తిలవుతూ అట్టడుక్కిపోతూ ఉంటే క్షణం క్షణం అనుక్షణం మనల్ని మనం చంపుకుంటూ నిస్సారంగా నిస్తేజంగా జీవించలేక అధికారుల అహం కారపు అన్యాయాల గిట్టలక్రింద నలగలేక ఏలినవారిని నిలదీస్తే ఫలితంగా నాకిచ్చిన పురస్కారం ఇది. కారణం చాలా చిన్నది. 'యదార్థవాది లోక విరోధి.'

మా హెడ్ ఆఫీసు హైదరాబాద్‌లో ఉండటంవల్ల రాజధానికి రాకతప్పింది కాదు.

మనస్సంతా అనీజీగా, చీకాకుగా ఉంది. స్టేషన్‌దాటి బయటకొచ్చి రోడ్డుమీద నడుస్తున్నాను. నా పక్కనుంచి మారుతీ థౌజండ్ దూసుకుపోయింది. అల్లంత దూరాని కెళ్ళి మళ్ళీ వెనక్కి వచ్చి నా పక్కన ఆగింది.

కార్లలో తిరిగే స్నేహితులెవరూ నాకు లేరు. ఆశ్చర్యపోయేంతలోనే డోరు తెరుచుకుంది. లోపల సూట్ లో ముఖానికి గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళద్దాలతో హుందాగా ఓ వ్యక్తి... ఎక్కడో చూసిన గుర్తు...??

"హలో... నువ్వేమిట్రా ఇక్కడ?" అడిగాడు కారు దిగుతూ.

అప్పుడు పోల్చుకోగలిగాను. వాడు కనకారావు.

చదువుకునే రోజులలో నా మిత్రుడు. నేను రాసింది చూసి రాసేవాడు క్లాసులో అంతా మొద్దు మొద్దు అంటూ హేళన చేసిన కనకారావు ఇప్పుడు ఇలా... నా కళ్ళని నమ్మలేకపోతున్నాను. సంభ్రమాశ్చర్యాలతో నోరెళ్లబెట్టాను.

"ఏమిటి సంగతి? ఎక్కడికి?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

"హెడ్డాఫీసుపని మీద వచ్చాన్లే! నువ్వేమిటి? ఏదైనా వ్యాపారం చేస్తున్నావా?" అడిగాను క్యూరియాసిటీతో.

"పద కార్లో కూర్చొని మాట్లాడుకుందాం." అంటూ డోరు తెరిచాడు.

ఏ.సి అవటంవల్ల కాబోలు లోపల చల్లగా ఉంది.

వాడి ఆఫీసు, స్టెనోగ్రాఫర్స్, ఎయిర్ కండీషన్డ్

భవంతులూ, చూస్తూంటే వాడు చాలా సంపన్నుడని నా కర్థమయింది. ఇక నాకు నోట మాట కరువైంది.

వాడు తన పర్సనల్ రూమ్‌లోనికి తీసుకెళ్ళి అతిథి మర్యాదలు అయ్యేక తన వ్యాపారం గురించి చెప్ప సాగాడు.

"ఐ.పి.యమ్. అనే పేరు ఎప్పుడైనా విన్నావా?" అడిగాడు.

లేదన్నట్లు తల అడ్డంగా ఊపాను.

"ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పొలిటికో మాన్యుఫాక్చరర్స్. ఆ సంస్థ ఇదే! అధినేతను నేనే!" అన్నాడు నవ్వుతూ.

"ఏం ప్రొడక్ట్ చేస్తారు?" అడిగాను అయోమయంగా.

"పొలిటికల్ హెడ్స్‌ని." అని వాడు చెప్పగానే విస్తుపోయాను.

నా పరిస్థితిని గ్రహించి వాడు వివరంగా చెప్పసాగాడు.

"మా సంస్థ కేవలం రాజకీయ లబ్దిదారులకి మాత్రమే ఉపయోగపడుతుంది. అడ్డదార్లలో ధనార్జన చేసి మమ్మల్ని ఆశ్రయిస్తారు.

ఆ తరువాత ప్రజాబలంతో పదవులు సంపాదించి రాజ్యాంగం ఆసరాతో ఐఎఎస్‌లనీ, ఐపిఎస్ లనీ, మేధావుల్నీ, శాసించే స్థాయికి ఎదిగిపోతారు. పార్టీల తరుపునా లేదా వ్యక్తుల తరుపునా మా సంస్థ వారధిలా పనిచేస్తుంది. వాళ్ళ సభల్ని జయప్రదం చేయటం, కొన్ని సభల్లో అల్లర్లు సృష్టించటం, జనాన్ని సమీకరించ టం, అలాగే పత్రికల్లో పార్టీకి సంబంధించిన సంపాదకీ యాలూ, పార్టీ వార్తలూ, వేదిక మీద ఉపన్యాసాలూ, ఇలాంటివన్నీ సమకూర్చుతూ ఉండటం మా పని.

ఉదాహరణకి ప్రజాదరణలేని ఓ ప్రాంతీయ పార్టీ ఉందనుకో మొదట దానికిసంబంధించిన బహిరంగ సభను రాష్ట్రంలో ఏదో మూలన ఏర్పాటుచేస్తాం! జనాల్ని లారీలమీద ట్రక్కుల మీద అవసరమైతే ప్రక్క రాష్ట్రాల నుంచీ కూడా తీసుకొచ్చి సభని విజయవంతం చేస్తాం!

ఆ తరువాత ఆహో ఓహో సక్సెస్ అంటూ సభ గురించి పత్రికల్లో రాయిస్తాం. దాంతో మిగతా ప్రాంతాల ప్రజల దృష్టి పార్టీపైకి మళ్ళుతుంది. మళ్లేటట్లు చేస్తామన్నమాట! ఇక రాష్ట్రంలో విరివిగా సదస్సులు నిర్వహిస్తాం! ఈ మాదిరిగా స్టెప్ బై స్టెప్ వేస్తూ విజయం దాకా శ్రమిస్తాం! కాబట్టే అన్ని పార్టీ నాయకులు మమ్మల్ని ఆశ్రయిస్తుంటారు."

నాకు అర్థం అవుతున్నకొద్దీ మెదడు మొద్దుబారి పోసాగింది.

"ప్రభుత్వకాలనీల్లో నివశించే మధ్యతరగతి వాళ్ళ తోనూ, మురికివాడల అలగా జనాలతోనూ మాకు సం బంధాలున్నాయి.

సభల్లో అల్లరి చేసేవాళ్ళకీ, చప్పట్లు కొట్టేవాళ్ళకీ, నినాదాలు చేసేవాళ్ళకి రేట్లుంటాయి. ఆ ప్రకారం డబ్బు ఇవ్వబట్టే మేం ఎక్కడికి అంటే అక్కడికి ఎప్పుడుబడితే అప్పుడు రావటానికి సిద్ధంగా ఉంటారు వాళ్ళు.

ఇదంతా చూసుకోటానికి తగిన సిబ్బంది ఉంది. మా సంస్థ ఇప్పుడిప్పుడే పక్క రాష్ట్రాలకీ కూడా విస్తరిస్తోంది. ఆదాయం పుష్కలంగా ఉన్నా అప్పుడప్పుడూ కాళ్ళూ చేతులూ పోయినోళ్ళకి మాత్రం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాల్సి వస్తోంది."

"మరి మీకు పని తగిలేది అయిదేళ్ళకి ఒకసారే కదా! మిగతా రోజులూ ఏం చేస్తారు?" అడిగాను సంశయంగా.

"పొరపాటు! ఓ వ్యక్తి గద్దెనెక్కేదాకా మాకు చేతినిండా పనే ఉంటుంది.

ఆ తరువాత అపోజిషన్ వాళ్ళు గానీ అసమ్మతివాళ్ళు గానీ మమ్మల్ని ఆశ్రయించి భారీ మొత్తాలు ముట్టచెప్పటం తో అల్లకల్లోలాలూ, అలజడులూ, అవసరం అయితే అత్యాచారాలూ, ఊచకోతలూ సృష్టించి ఆ వ్యక్తిని గద్దె దింపేదాకా మళ్ళీ చేతినిండా పనే!

అయితే ఇప్పుడిప్పుడే పాలనలో ఉన్న ఏలినవారు కూడా తమ జోలికి రాకుండా మాకు మంత్లీ ఫార్మాలిటీసు కూడా ఇస్తున్నారనుకో...

-వాడు చెబుతూనే ఉన్నాడు. నాకేమీ వినిపించటం లేదు.

ప్రజాస్వామ్యం స్వార్థం అనే సమాధిగోడలమధ్య ఇరుక్కుపోతున్నట్లనిపించింది.

ఈ ముష్కరుల రాజ్యం నుంచి ముక్తినొందిన ఓ మహనీయుని ఆక్రోశమే నా చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది.


"దేవుడా! రక్షించు నా దేశాన్ని.

పెద్దమనుషుల నుండి... పెద్దపులుల నుండి...

నీతులు రెండు నాల్కలుసాచి బుసలుకొట్టే నిర్వేతుక కృపా సర్పాలు నుంచి రక్షించు నా దేశాన్ని."

★

## సుధాచంద్రన్ పెళ్ళి



కారు ప్రమాదంలో ఒక కాలుని పోగొట్టు కున్నప్పటికీ పట్టుదలతో కృషిచేసి కృత్రిమ కాలుతో నాట్యప్రదర్శన లిచ్చి సంచలనం సృష్టించడమే కాకుండా 'మయూరి' తెలుగు చిత్రం ద్వారా చిత్ర రంగానికి పరిచయమైంది సుధా చంద్రన్, తర్వాత 'నాచే మయూరి' తో హిందీ తెరపై కనిపించి ఇప్పుడు కొన్ని టీవీ సీరియల్స్‌లోనూ, హిందీ సినిమాల్లోనూ నటిస్తోంది. తాజాగా సుధా చంద్రన్ సృష్టించిన సంచలనం పెళ్ళి చేస్కోడం. సినీ జనాలందర్ని ఆశ్చర్యపరుస్తూ 'రవి' అనే అసిస్టెంట్ డైరెక్టర్ని ఇటీవలే పెళ్ళాడింది. మా ఇద్దరిదీ చాలా ఏళ్ళ పరిచయం. మా పెళ్ళిని మా పెద్దలు అంగీకరించారు. అని చెబుతోంది సుధా (చంద్రన్) రవి.

-మౌర్య.




డా॥శివ, కార్టూనిస్ట్, పోస్ట్ః బషీరాబాద్, వయాః మోర్తాడ్, జిల్లాః నిజామాబాద్.